సాక్షి
తిరుపతి
గురువారం । 1 । ఆగస్టు । 2024



రహదారుల్లో పురోగతి చూపండి

జాతీయ రహదారుల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. - 8లో



నగదు, బంగారం అప్పగింత

తిరుమలకు వెళ్తూ నగదు, బంగారు నగల బ్యాగ్‌ను పోగొట్టుకున్న భక్తుడికి పోలీసులు తిరిగి అప్పగించారు. - 8లో



సంఘాలను బలోపేతం చేయండి

సహకార సంఘాల బలోపేతంపై డీఆర్వో పెంచల కిషోర్ కలెక్టరేట్‌లో ఆ శాఖ అధికారులతో సమీక్షించారు. - 8లో

న్యూస్‌రీల్

విద్యార్థుల జీవితాలతో చెలగాటమా..!



వర్సిటీ పరిపాలనా భవనం ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు

తిరుపతి సిటీ: శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ ఎంబీఏ కళాశాల అధికారులు ఫీజు చెల్లించకపోతే హాల్ టిక్కెట్లు ఇవ్వమంటూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమడుతున్నారని ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నాయకులు ఆరోపించారు. బుధవారం వారు వర్సిటీ పరిపాలనా భవనం ముందు ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రభుత్వం చెల్లించాల్సి ఉండగా ఎంబీఏ కళాశాల ప్రిన్సిపల్ కోర్సు ఫీజు చెల్లించనిదే హాల్‌టికెట్లు ఇచ్చే ప్రసక్తే లేదంటూ విద్యార్థులను వేధిస్తున్నారని మండిపడ్డారు. బుధవారం నుంచి ఎంబీఏ పరీక్షలు జరగనున్న నేపథ్యంలో విద్యార్థులను వర్సిటీ అధికారులు ఇలా వేధించడం దారుణమన్నారు. ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోతే, పేద విద్యార్థులు కోర్సు ఫీజు ఎలా చెల్లిస్తారని ప్రశ్నించారు. పరీక్ష రుసుము చెల్లించిన ప్రతి విద్యార్థికి హాల్‌టికెట్లు వెంటనే జారీ చేయాలని డిమాండు చేశారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులతో రిజిస్ట్రార్ భూపతి నాయుడు చర్చించి హాల్‌టికెట్లు విద్యార్థులకు అందజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు అక్బర్, రవి, వర్సిటీ అధ్యక్ష, కార్యదర్శులు నరేంద్ర, వినోద్, మాధవ్‌కృష్ణ, తేజ, వీరేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీలో బయటపడిన వర్గపోరు

సూళ్లూరుపేట రూరల్: అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే టీడీపీలో వర్గ విభేదాలు భగ్గుమంటున్నాయి. తారాస్థాయికి చేరడంతో సీనియర్ నాయకులు తలలు పట్టుకుంటున్నారు. ఎన్నికల సమయంలో ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి, పార్టీలో ఎప్పటి నుంచో ఉన్న సీనియర్ నాయకులకు మధ్య సయోధ్య కుదరడం లేదు. దీంతో గ్రామాల్లో నిర్వహించే కార్యక్రమాల్లో నాయకులు ఎడమొహం, పెడమొహంగా ఉంటున్నారు. తాజాగా సూళ్లూరుపేట మండలం కోటపోలూరు పంచాయతీలో మేడమ్‌గా వ్యవహరిస్తున్న టీడీపీ నాయకురాలు ఇసనక శ్రీవాణి, అదే పార్టీకి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు వాసం రెడ్డి సుధాకర్‌రెడ్డి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. ఇటీవల శ్రీవాణి గ్రామ ముఖద్వారం వద్ద తన సొంత నిధులతో ఆర్చి నిర్మాణం చేపట్టేందుకు గ్రామసభలో తీర్మానం ప్రవేశపెట్టారు. ఇందుకు కూటమి నాయకులు అంగీకారం తెలిపారు. రెండు రోజుల క్రితం జాతీయ రహదారి నుంచి కొంత దూరంలో ఉన్న అర్‌అండ్‌బీ రోడ్డు పక్కన ఆర్చి నిర్మాణానికి పనులు కూడా ప్రారంభించారు. ఇక్కడే టీడీపీ నాయకుల మధ్య వివాదం రేగింది. టీడీపీ నాయకుడు సుధాకర్‌రెడ్డి కొంతమంది యువకులతో కలిసి ఆర్చి నిర్మాణాన్ని ఆపించారు. ఆర్చి నిర్మాణానికి ఆర్‌అండ్‌బీ అధికారుల నుంచి ఎటువంటి అనుమతి తీసుకోలేదని, ఆర్చి నిర్మాణం జరిగితే రోడ్డు ప్రమాదాలు జరుగుతాయని అభ్యంతరం తెలిపారు. ఈ సమస్యను నియోజకవర్గ నాయకుల దృష్టికి వెళ్లినా పట్టించుకోకపోవడం గమనార్హం.

ప్రకృతి వ్యవసాయ పంటల పరిశీలన



వరి పంటను పరిశీలిస్తున్న తిరుపతి జిల్లా వ్యవసాయాధికారి ప్రసాద్‌రావు

రామచంద్రాపురం: మండలంలోని నెత్తకుప్పం, చిట్టత్తూరు కాలేపల్లి గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన పంటలను బుధవారం తిరుపతి జిల్లా వ్యవసాయాధికారి ప్రసాద్‌రావు ప్రకృతి వ్యవసాయ డీపీఎం షణ్ముగంతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్న ఏటీఎం మోడల్‌ను పరిశీలించి తగు సూచనలు చేశారు. ద్రవజీవామృతం, ఘనామృతం, నీమాస్త్రం తయారీ విధానాలను గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా నేల సారవంతమై అధిక దిగుబడితో ఆరోగ్యకరమైన పంటను పొందవచ్చన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఇసుక మేత

రాష్ట్రంలో కూటమి సర్కారు కొలువుదీరిన నాటి నుంచి ప్రతిపక్ష పార్టీ నేతలు, కార్యకర్తలపై ఒకవైపు దాడుల పరంపర కొనసాగుతుండగా.. మరోవైపు మాత్రం అక్రమ మార్గాల్లో డబ్బు సంపాదనే లక్ష్యంగా ముందుకెళ్తున్నారు. అందులో వారికి అతి ముఖ్యమైనది ఇసుక. ప్రభుత్వం ఉచిత ఇసుక అని ప్రకటించినా.. వినియోగదారులు మాత్రం ఇసుకను కాసులిచ్చి కొనుగోలు చేయక తప్పలేదు. ప్రభుత్వం తిరుపతి జిల్లాలో కేవలం నాలుగు రీచ్‌లను మాత్రమే ఏర్పాటు చేసింది. ఇదే పచ్చనేతల పాలిట వరంగా మారింది. వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు సాగు చేసుకుంటున్న భూముల్లో దౌర్జన్యంగా ఇసుక తవ్వి కాసులకు అమ్ముకుంటున్నారు.



ఏర్పేడు: పెనుమల్లం గ్రామంలో రైతు రాజశేఖర్‌రెడ్డి పొలంలో టీడీపీ నేతలు చేపట్టిన ఇసుక తవ్వకాలు

జిల్లాలో ప్రభుత్వ ఇసుక స్టాక్ పాయింట్లు..
- వెంకటగిరి, మొగళ్లగుంట టన్ను రూ.590
- సూళ్లూరుపేట, మావిళ్లపాడు టన్ను రూ.465
- పిచ్చాటూరు, ఏకే బేడు టన్ను రూ.200
- నాగలాపురం, సుబ్బానాయుడు కండ్రిగ టన్ను రూ.200

వైఎస్సార్‌సీపీ నేతల సాగు భూములే లక్ష్యం

- రైతులు సాగు చేసుకుంటున్న డీకేటీ భూముల్లో ఇసుక తోడేస్తున్న కూటమి నేతలు
- జిల్లాలో టీడీపీ నేతల అనధికార స్టాక్ పాయింట్లు
- ప్రభుత్వ పాయింట్లలో నో స్టాక్– టీడీపీ నేతల పాయింట్లలో ఫుల్ స్టాక్
- స్వర్ణముఖినది తీరంలో ఇష్టారాజ్యంగా ఇసుక అక్రమ వ్యాపారం
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని రెవెన్యూ, మైనింగ్ శాఖ అధికారులు
- వీఆర్‌ఏను భయభ్రాంతులకు గురిచేసిన ఇసుక మాఫియా
- గత వారం రోజులుగా అరుణానదిలో యథేచ్ఛగా అక్రమ రవాణా

సాక్షి ప్రతినిధి, తిరుపతి/తిరుపతి అర్బన్: కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక అని చెప్పినా, ఆ పార్టీల నేతలు, కార్యకర్తలు మాత్రం వక్రమార్గంలో కాసులు దండుకుంటున్నారు. ప్రభుత్వం ఇసుక ఉచితం అని ప్రకటించగానే అధికారులు తిరుపతి జిల్లాలోని వెంకటగిరి మండలం మోగళ్లగుంట,



పెనుమల్లంలో ఇసుకను ట్రాక్టర్‌లో తరలిస్తున్న దృశ్యం

సూళ్లూరుపేట మండలం మావిళ్లపాడు, పిచ్చాటూరు మండలం ఏకే బేడు, నాగలాపురం మండలం సుబ్బానాయుడు కండ్రిగలో రీచ్‌లను ఏర్పాటు చేశారు. అయితే ఆయా ప్రాంతాలకు వెళ్లి ఇసుక తెచ్చుకోవాలంటే కొనుగోలుదారులకు తడిసి మోపెడవుతోంది. మరోవైపు ప్రభుత్వం ఏర్పాటు చేసిన నాలుగు ఇసుక పాయింట్లను ప్రారంభించిన నాటి నుంచే నో స్టాక్ అని దర్శనమిస్తున్నాయి. అనేక మంది కొనుగోలుదారులు ఇసుక కోసం అక్కడికి వెళ్లడం.. నో స్టాక్ అని తెలిసి నిరాశతో వెనుదిరుగుతున్నారు. అధికారులు కనీస సమాచారం ఇవ్వకపోవడంతో రానుపోను ఖర్చులు, సమయం వృథా అవుతోందని కొనుగోలుదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

టీడీపీ నేతల ఇసుక పాయింట్లు

ఏర్పేడు మండలం: పెనుమల్లం, గుడిమల్లం, మునగలపాళెం, పాపానాయుడుపేట
శ్రీకాళహస్తి మండలం: అమ్మపాళెం, పుల్లారెడ్డికండ్రిగ, చుక్కల నిడిగల్లు
వాకాడు మండలం: బాలిరెడ్డిపాళెం, కాచీపురం, పుచ్చలపల్లి
కోట మండలం: గూడలి, తిన్నలపూరి, దొరవుకట్ట
చిట్టమూరు మండలం: గుణపాడు, మెట్టు

స్వర్ణముఖి తీరంలో అక్రమ ఇసుక రీచ్‌లు

అధికార పార్టీకి చెందిన నేతలు, కార్యకర్తలకు లబ్ధి చేకూర్చడానికే ప్రభుత్వం ఏర్పాటు చేసిన నాలుగు ఇసుక పాయింట్లలో నో స్టాక్ పెడుతున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ రీచ్‌ల వద్ద ఇసుక లేకుండా చేసి.. కూటమి నేతలు సొంతంగా ఇసుక పాయింట్లు ఏర్పాటు చేసుకున్నారు. అది కూడా రైతులు సాగు చేసుకుంటున్న వ్యవసాయ భూముల్లో నుంచి దౌర్జన్యంగా ఇసుకను తవ్వి డంప్ చేసి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గం ఏర్పేడు మండలం పెనుమల్లం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత రాజశేఖర్‌రెడ్డి పొలాన్ని ఆక్రమించుకుని రెండు రోజులుగా టీడీపీ నేతలు ఇసుక తవ్వకాలు చేపట్టారు. ప్రతి రోజూ 100 ట్రాక్టర్లలో పుత్తూరు, రేణిగుంట, తిరుపతి, చంద్రగిరి వరకు తరలించి కాసులు దండుకుంటున్నారు. ఒక్కో ట్రాక్టర్‌కు రూ.5 వేల నుంచి రూ.7 వేలకు, మరికొన్నిచోట్ల రూ.6 వేల నుంచి రూ.9 వేల వరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమ తవ్వకాలను రైతు అడ్డుకునే ప్రయత్నం చేస్తే అతనిపై టీడీపీ నేతలు దౌర్జన్యం చేస్తున్నారు. ఇలా ఏర్పేడు మండలంలో పాపానాయుడు పేట పరిసరాల్లోని 13 గ్రామాల్లో స్వర్ణముఖి పరివాహన ప్రాంతంలో రైతులకు చెందిన డీకేటీ భూములపై పచ్చనేతల కన్నుపడింది. కూటమి పార్టీకి చెందిన వారి భూములను విడిచిపెట్టి వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు సాగు చేసుకుంటున్న వ్యవసాయ భూములనే లక్ష్యంగా చేసుకుని ఇసుక తవ్వకాలు చేస్తున్నారు.

ఆ పాయింట్ల వద్ద ఇసుక ఫుల్‌స్టాక్

జిల్లాలోని అన్ని మండలాల్లో కూటమి నేతలు 100కుపైగా అనధికారిక ఇసుక పాయింట్లు ఏర్పాటు చేసుకున్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలను ఇసుక వ్యాపారం చేసుకోవాలని ప్రోత్సహించారు. దీంతో ఏ ఊరిలో చూసినా కార్యకర్తలు ట్రాక్టర్లతో సమీపంలోని స్వర్ణముఖినది ప్రాంతం నుంచి ఇసుక తవ్వకాలు చేపట్టారు. పచ్చనేతలు ఏర్పాటు చేసిన ఇసుక పాయింట్ల వద్ద ఫుల్ స్టాక్ కనిపిస్తోంది.

నాకు న్యాయం చేయండి



గుంటకిందపల్లి రాజశేఖర్‌రెడ్డి, రైతు

నా పేరు గుంటకిందపల్లి రాజశేఖర్‌రెడ్డి. ఏర్పేడు మండలంలోని పెనుమల్లం గ్రామం, స్వర్ణముఖినది సమీపంలో నాకు రెండు ఎకరాల డీకేటీ భూమి ఉంది. పదేళ్లుగా భూమి సాగు చేసుకుంటున్నా. నా భూమిలో 15 అడుగుల వరకు ఇసుక పొరలు ఉన్నాయి. మా పొలంలో టీడీపీ నేతలు రెండు రోజులుగా 100 ట్రాక్టర్లలో ఇసుకను తవ్వేస్తున్నారు. మైనింగ్ అధికారులకు సమాచారం ఇస్తే రెవెన్యూ వారికి చెప్పమని సూచించారు. రెవెన్యూ అధికారులకు చెప్తే వీఆర్వో లోకేశ్వరిని పంపించారు. ఆమె వచ్చి ఇసుక తవ్వకాలను చూసి టీడీపీ నేతల ఒత్తిళ్లతో చేసేదేమీ లేక తిరిగి వెళ్లిపోంది. నేను వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు కావడంతోనే నాపై కక్షతో ఇసుక తవ్వకాలు చేపట్టారు. న్యాయం చేయండి.

ఇసుక అక్రమ రవాణా అడ్డుకునేదెవరు ?

తిరుపతి జిల్లా నారాయణవనం మండలం సముదాయం దగ్గరలో ఉన్న అరుణనదిని ఆనుకుని ఉన్న ఐదెకరాల ప్రభుత్వ భూమిలో పాఠశాల, యానాది ఎస్టీ కాలనీ, గ్రామ సచివాలయం ఉన్నాయి. ఈ భూమిలోనే ఇసుక మాఫిక రాత్రింబవళ్లు ఇసుకను అక్రమంగా రవాణా చేస్తోంది. తద్వారా రోజుకు రూ.లక్షల్లో సంపాదించుకుంటున్నారు. పైగా తమపై అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోరని, ఇప్పటికే వీఆర్ఏకు వార్నింగ్ ఇచ్చి పంపించామని మాఫియాకు చెందిన వారు చెబుతున్నారు. అధికారులను మేనేజ్ చేస్తున్నాం.. తమకు అడ్డు ఎవరు ? అంటూ మాఫియా ప్రజలను రైతులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. స్థానిక ప్రజలు పోలీసులకు, మైనింగ్ శాఖ అధికారులకు విన్నవించినా స్పందన లేదు. ఇలాగే కొనసాగితే ప్రభుత్వ పాఠశాల గోడలు కూలిపోవడం, సముదాయం యానాది ఎస్టీ కాలనీ, పక్కనే ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్‌కు సంబంధించిన స్తంభాలు నేల కూలే అవకాశం ఉంది. ఇప్పటికైనా జిల్లా మైనింగ్, పోలీసు, రెవెన్యూ అధికారులు సముదాయం అరుణానదిలో ఇసుక మాఫియాను పూర్తిగా అరికట్టి వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



సూళ్లూరుపేట: మావిళ్లపాడు వద్ద ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఇసుక రీచ్



నారాయణవనం: సముదాయంలో ఇసుకను అక్రమంగా ట్రాక్టర్‌లోకి లోడ్ చేస్తున్న దృశ్యం

వెంకటగిరి: ఇసుక లేక ఖాళీగా దర్శనమిస్తున్న మొగళ్లగుంట పాయింట్



ప్రమాదాలకు దూరంగా ఉందాం

- బ్లాక్ స్పాట్లను గుర్తించండి
- గోల్డెన్ అవర్‌పై అవగాహన కల్పించండి

తిరుపతి అర్బన్: రోడ్డు ప్రమాదాలకు అంతా దూరంగా ఉందామని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు తప్పకుండా ట్రాఫిక్ నియమాలను పాటించేలా అవగాహన కల్పించాలని సూచించారు. మరోవైపు ఎప్పుడో గుర్తించిన బ్లాక్ స్పాట్లతో పాటు కొత్తగా ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించాలని ఆదేశించారు. మరోవైపు గోల్డెన్ అవర్‌పై అందరికీ అవగాహన కల్పించాలన్నారు. ప్రమాదం జరిగిన గంటలోపు క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించిన వారికి గుడ్ సమారిటన్ పేరిట కేంద్ర ప్రభుత్వం రూ.5 వేలు నగదు, ప్రశంసాపత్రాన్ని ఇస్తోందని వివరించారు. కార్యక్రమంలో జిల్లా రవాణా అధికారి ఆదినారాయణ, జాతీయ రహదారుల ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా ఆరోగ్యశాఖ అధికారి శ్రీహరి, రుయా ఆస్పత్రి సూపరింటెండెంట్ రవిప్రభ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

శాఖల వారీగా నివేదికలు ఇవ్వండి


తిరుపతి అర్బన్: ఆగస్టు మొదటి వారంలో జిల్లా కలెక్టర్లతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష చేపట్టనున్నారని.. శాఖల వారీగా సమస్యల పరిష్కారంతో పాటు చేపట్టాల్సిన అభివృద్ధి అంశాలపై నివేదికలు ఇవ్వాలని కలెక్టర్ వెంకటేశ్వర్ కోరారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లో జేసీ శుభం బన్సల్, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ నారపురెడ్డి మౌర్యతో కలసి అధికారులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా మున్సిపల్ కార్పొరేషన్, పరిశ్రమలు, పర్యాటకరంగం అభివృద్ధికి సంబంధించి ప్రజెంటేషన్ సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమలశాఖ అధికారి ప్రతాప్‌రెడ్డి, జిల్లా పర్యాటకశాఖ అధికారి రూపేంద్రనాథ్ రెడ్డి, డివిజనల్ మేనేజర్ టూరిజం విభాగం అధికారి గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు తల్లిపాలే బెస్ట్ ..



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, అధికారులు

పిల్లలకు తల్లిపాలు మంచి పౌష్టికాహారమని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ నారపురెడ్డి మౌర్యతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 1992 నుంచి తల్లిపాల ఆవశ్యకతను తెలియజేయడానికి ప్రపంచ స్థాయిలో ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీహరి, డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ శాంతకుమారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.




తిరుపతి బులియన్

బంగారం :
24 క్యారెట్లు 10 గ్రాములు రూ.71,430
22 క్యారెట్లు ఒక గ్రాము రూ.6,415
వెండి:
హోల్‌సేల్ ధర (కిలో) రూ.85,300
రిటైల్ వెండి గ్రాము రూ.87.30

క్లుప్తంగా

రుయా ఆస్పత్రి నుంచి రోగి పరార్


జూపార్క్ రోడ్డులో పడి ఉన్న రోగి

తిరుపతి తుడా: తిరుపతి రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ రోగి చెప్పా పెట్టకుండా బుధవారం పరారయ్యాడు. ఈ క్రమంలో అతను జూపార్కు రోడ్డులో పడి ఉండడాన్ని గుర్తించిన కొందరు చికిత్స కోసం తిరిగి రుయాలో చేర్పించారు. తీవ్ర గాయాలతో పడి ఉన్న మతిస్థిమితం లేని ఓ వ్యక్తిని నాలుగు రోజుల క్రితం రుయాలో చేర్పించారు. ఈ క్రమంలో రుయాలోని ఎంఎస్ (మేల్ సర్జికల్) వార్డులో చికిత్స పొందుతూ అక్కడే విధుల్లో ఉన్న సిబ్బందికి మస్కా కొట్టి పరారయ్యాడు. సిబ్బంది నిర్లక్ష్యంపై ఆరోపణలు రావడంతో విమర్శలు వెల్లువెత్తాయి. రోగి బాత్‌రూమ్‌కి వెళ్లి అలానే కనిపించకుండా పోయాడని, ఇందులో సిబ్బంది తప్పులేదని అధికారులు తేల్చారు.

ఉమ్మడి జిల్లాలో పనులకు ప్రతిపాదనలు పంపండి

– జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలో జెడ్పీటీసీల పరిధిలో రూ.30 లక్షలు, ఎమ్మెల్యేల పరిధిలో రూ.50 లక్షల అంచనాలతో పనులు చేయడానికి ప్రతిపాదనలు పంపాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు కోరారు. ఇందులో 50 శాతం పనులు వాటర్ వర్క్స్, మిగిలినవి రోడ్లు, కాలువల పనులకు వాడుకోవాలన్నారు. మండలాల వారీగా జెడ్పీటీసీలు సంబంధిత పనుల వివరాలు, అంచనా వ్యయంతో వివరాలను సిద్ధం చేసి రెండు వారాల్లోపు తమ కార్యాలయంలో అందజేయాలన్నారు.

రేపు డయల్ యువర్ టీటీడీ ఈఓ

తిరుమల: డయల్ యువర్ టీటీడీ ఈఓ కార్యక్రమం శుక్రవారం ఉదయం 9 నుంచి 10 గంటల వరకు తిరుపతి టీటీడీ పరిపాలన భవనంలోని సమావేశ మందిరంలో జరుగనుంది. ఈ కార్యక్రమంలో భక్తులు తమ సందేహాలు, సూచనలను టీటీడీ ఈఓ శ్యామలరావుకు 0877–2263261 ఫోన్ ద్వారా తెలుపవచ్చు.

తిరుపతి రూరల్ మండలం పేరూరు పంచాయతీలో భూ బకాసురులు స్వైర విహారం చేస్తున్నారు. కాలువలు.. చెరువులు.. వాగులు.. వంకల స్థలాలు కనిపిస్తే గద్దల్లా వాలిపోతున్నారు. జేసీబీలను తీసుకెళ్లి యథేచ్ఛగా పూడ్చివేస్తున్నారు. స్థానికుల ఫిర్యాదుల మేరకు అధికారులు ఏర్పాటు చేస్తున్న హెచ్చరిక బోర్డులను సైతం మాయం చేసేస్తున్నారు. భూ దాహం తీర్చుకునేందుకు బరితెగించేస్తున్నారు.

బరితెగింపు!

పేరూరు చెరువును వదలని పచ్చ గద్దలు

- కాలువ పోరంబోకు ఆక్రమణకు యత్నం
- రెవెన్యూ హెచ్చరిక బోర్డు సైతం మాయం
- పట్టపగలే జేసీబీలతో కాలువ పూడ్చివేత
- తిరగబడిన ఎస్సీ కాలనీ మహిళలు
- కబ్జాలో ఓ హోంగార్డు పాత్ర కీలకం

తిరుపతి రూరల్ : పేరూరు పంచాయతీలో ఇప్పటికే పేరూరు చెరువు, రామానుజపల్లె కాలువ పోరంబోకులను ఆక్రమించేందుకు స్థానిక టీడీపీ నేతలు కొందరు ప్రయత్నించారు. ఇటీవల దాదాపు రూ.2 కోట్ల విలువైన చెరువు, కాలువ స్థలాలను ఆక్రమించేందుకు చదును చేశారు. దీనిపై 'సాక్షి'లో 'పేరూరు చెరువుపై పచ్చ గద్దలు' పేరిట కథనం రావడంతో స్థానికులు ధైర్యంగా ఎదురుతిరిగారు. ఈ క్రమంలో టీడీపీకి చెందిన భూ బకాసురులు తాత్కాలికంగా వెనక్కుతగ్గారు.



రెవెన్యూ అధికారుల ఏర్పాటు చేసిన బోర్డు

హెచ్చరిక బోర్డు తొలగించి..

పేరూరు లెక్క దాఖల సర్వే నంబర్ 460లో రెండు ఎకరాల వరకు కాలువ పోరంబోకు ఉంది. గతంలో రూ.2 కోట్ల విలువైన భూములను కబ్జా చేసేందుకు ప్రయత్నించి, తర్వాత వెనక్కి తగ్గిన టీడీపీ చోటా నేతల కన్ను ఈ దఫా రూ.4 కోట్ల విలువైన ఈ కాలువపై పడింది. నాలుగు రోజుల క్రితం 200 అంకణాల మేర కాలువ గట్టును జేసీబీలతో చదును చేశారు. దీని విలువ దాదాపు కోటి రూపాయలు ఉంటుంది. పక్కనే ఉన్న రెండు ఎస్సీ కాలనీల ప్రజలు ఈ కబ్జాపై మండిపడ్డారు. జేసీబీలను అడ్డుకున్నారు. దీంతో రెవెన్యూ అధికారులు సదరు స్థలంలో మంగళవారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఎవరైనా ఆక్రమించేందుకు ప్రయత్నిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఆర్‌ఐ శివకుమార్, వీఆర్‌ఓ దిలీప్ హెచ్చరించారు. అయితే బుధవారం మళ్లీ టీడీపీ చోటా నేతలు జేసీబీలతో వచ్చారు. రెవెన్యూ అధికారుల హెచ్చరిక బోర్డులను సైతం విరిచేసి అక్కడ నుంచి మాయం చేశారు. అనంతరం జేసీబీలతో మరో 200 అంకణాల కాలువ గట్టును తొలగించి చదును చేశారు. ఈ విషయం గమనించిన స్థానిక ఎస్సీ కాలనీల మహిళలు అడ్డుకున్నారు. దీంతో స్థానికులపై టీడీపీ నేతలు దాడికి సైతం ప్రయత్నించారు. బాధితులు వెంటనే 100కు కాల్ చేయడంతో, పోలీసులు, రెవెన్యూ అధికారులు అక్కడికి చేరుకుని ఆక్రమణను అడ్డుకున్నారు. పోలీసుల ఎదుటే రెవెన్యూ అధికారులపై సైతం టీడీపీకి చెందిన కబ్జాదారులు దాడికి ప్రయత్నించారు. కాలువ కబ్జాలో స్థానికుడైన ఓ హోంగార్డు కీలక పాత్ర పోషిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అతను గతంలో ఓ మహిళపై దాడి చేసిన కేసులో సస్పెన్షన్‌కు గురై బెయిల్‌పై రావడం గమనార్హం. పోలీసు అని చెప్పుకుంటూ కబ్జాలకు పాల్పడుతున్న హోంగార్డుపై స్థానికులు మండిపడుతున్నారు. ఈ మేరకు ఎస్పీకి సైతం ఫిర్యాదు చేశారు.


కాలువగట్టును తొలగించి జేసీబీలతో చదును చేయిస్తున్న కబ్జాదారులు

> **క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం**
>
> సర్వే నెంబర్ 460లోని కాలువ పోరంబోకును కొందరు కబ్జా చేసేందుకు ప్రయత్నించారు. వాటిని అడ్డుకున్నాం. చదును చేసేందుకు తీసుకువచ్చిన జేసీబీలను సైతం గుర్తించాం. కబ్జాకు ప్రయత్నించిన వారిపై క్రిమినల్ కేసులను తప్పకుండా నమోదు చేస్తాం.
>
> – శివకుమార్, ఆర్‌ఐ, తిరుపతి రూరల్

రహదారుల్లో పురోగతి చూపండి

తిరుపతి అర్బన్: జాతీయ రహదారుల పనుల్లో పురోగతి చూపాలని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లో రెవెన్యూ, జాతీయ రహదారుల విభాగానికి సంబంధించి తిరుపతి, నెల్లూరు, చెన్నై అధికారులతో జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌తో కలసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు సమిష్టిగా ఓ ప్రణాళికతో టైంలైన్ ప్రకారం రోడ్డు పనులు పూర్తి చేయాలని సూచించారు. ఆ మేరకు నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. పనులు చేపట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఆర్వో పెంచల కిషోర్, ఆర్డీఓలు నిషాంత్ రెడ్డి, కిరణ్‌కుమార్, రవిశంకర్‌రెడ్డి, జాతీయ రహదారుల తిరుపతి జిల్లా పీడీ వెంకటేష్, నెల్లూరు పీడీ కొండయ్య చందు, చెన్నై పీడీ రవీంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

తిరుపతి అర్బన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ నేతృత్వంలో అమరరాజాలో మిషన్ ఆపరేటర్స్ అండ్ అప్రెంటీస్ ఉద్యోగాలకు కలెక్టరేట్‌లో బుధవారం కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్ చేతుల మీదుగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి లోకనాథం మాట్లాడుతూ పది, ఇంటర్ పాస్ లేదా ఫెయిల్ అయిన వారితో పాటు ఐటీఐ ఉత్తీర్ణత అయిన వారికి ఇంటర్వ్యూలు నిర్వహించి అప్రెంటీస్ ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పారు. 16–35 ఏళ్ల వయస్సు వారు ఆసక్తి కలిగి ఉంటే ఈ నెల 6వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, అలాగే ఈ నెల 7వ తేదీ ఉదయం 9 గంటలకు తిరుపతిలోని అమరరాజా గ్రూప్ వద్దకు రావాలని సూచించారు. అదనపు సమాచారం కోసం 9177508279, 9000024919 నంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ ఉద్యోగులు పాల్గొన్నారు.

బాలికతో వృద్ధుడి అసభ్య ప్రవర్తన

ఓజిలి: మండలంలోని పున్నేపల్లి ఎస్సీ కాలనీకి చెందిన ఓ గిరిజన బాలికతో అరవై ఏళ్ల వృద్ధుడు అసభ్యకరంగా ప్రవర్తించిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. పున్నేపల్లి ఎస్సీ కాలనీలో ప్రాథమిక పాఠశాలలో గిరిజన బాలిక ఒకటో తరగతి చదువుతోంది. ఈ క్రమంలో రోజులానే ఆ బాలిక పాఠశాలకు వెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగి వెళ్తుండగా బాలికపై కన్నేసిన ఈశ్వరయ్య(60) అనే వృద్ధుడు బాలికను పట్టుకుని అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో బాలిక ఏడుస్తూ కాలనీలోకి వచ్చి బంధువులు, గ్రామస్తులకు విషయం చెప్పింది. గ్రామస్తులు వృద్ధుడిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. సమాచారం అందుకున్న నాయుడుపేట రూరల్ సీఐ జగన్‌మోహన్‌రావు, ఎస్ఐ రవిబాబు సంఘటనా స్థలానికి చేరుకుని బాలిక నుంచి వివరాలు సేకరించారు. వృద్ధుడిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

తిరుపతి క్రైమ్: నగరంలో నివాసం ఉంటున్న ఓ వ్యక్తి మనస్తాపంతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. అలిపిరి ఎస్ఐ రామస్వామి తెలిపిన వివరాల మేరకు.. నగరంలోని శివజ్యోతి నగర్‌లో నివాసం ఉంటున్న గణేష్(41) ఎలక్ట్రికల్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గత కొద్ది నెలలుగా ఈయన భార్యతో గొడవలు జరిగి ప్రస్తుతం డైవర్స్ కేసు కోర్టులో నడుస్తోంది. ఈ క్రమంలో ఇద్దరు పిల్లలు కూడా భార్య వద్ద ఉండిపోవడంతో ఎవరూ లేరని తీవ్ర మనస్తాపానికి గురై ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాల తరలించారు.

కదులుతున్న రైలు నుంచి దిగబోయి..


మృతి చెందిన బాషా

పాకాల: రైలు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన స్థానిక రైల్వే స్టేషన్‌లో చోటు చేసుకుంది. బుధవారం రైల్వే పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పాకాల మండలం రమణయ్యగారిపల్లికి చెందిన పాదిలి గవర్నర్ బాషా(48) పాకాల నుంచి చిత్తూరు వెళ్లడానికి టికెట్ తీసుకున్నాడు. అదే సమయంలో పొరపాటున 3 నంబర్ ప్లాట్‌ఫాంలో కాట్పాడి నుంచి తిరుపతికి వెళ్లే రైలు ఎక్కాడు. రైలులో కూర్చున్న తరువాత పక్కవారిని ఇది చిత్తూరు వెళ్లే రైలా అని అడిగాడు. సహచర ప్రయాణికులు ఇది తిరుపతికి వెళ్లే రైలని చెప్పడంతో కదులుతున్న రైలు నుంచి దిగే ప్రయత్నం చేశాడు. ఈ ఘటనలో గవర్నర్‌బాషా రైలుకి, ప్లాట్‌ఫాంకి మధ్యలో ఇరుక్కుపోయాడు. సుమారు 15 నుంచి 20 అడుగుల దూరం వరకు రైలు అతన్ని లాక్కుపోయింది. గుర్తించిన రైల్వే అధికారులు రైలును ఆపి తీవ్రంగా గాయపడిన అతన్ని 108 వాహనంలో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో వైద్యులు పరిశీలించి అప్పటికే అతను మృతి చెందినట్లు తెలిపారు. రైల్వే ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో డ్రైవర్‌కు జైలు

తిరుపతి లీగల్ : అధిక మోతాదులో మద్యం తాగి తిరుపతిలో ఆటో నడుపుతున్న తంబళ్లపల్లికి చెందిన డ్రైవర్ ఎస్.బావాజాన్‌కు మూడు రోజులు జైలు శిక్ష, రూ10 వేలు జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ బుధవారం తీర్పు చెప్పారు. అలాగే స్వల్ప మోతాదులో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 13 మందికి ఒక్కొక్కరికి రూ.పదివేల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెల్లడించారు. తిరుపతి అర్బన్ ఎస్పీ సుబ్బారాయుడు ఆదేశాల మేరకు ట్రాఫిక్ పోలీసులు నగరంలో పలుచోట్ల తనిఖీలు నిర్వహించి మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేశారు. వారిని కోర్టులో హాజరు పరిచినట్లు కోర్టు కానిస్టేబుల్ గిరిబాబు తెలిపారు.

జనరల్ బోగీల్లో సౌకర్యాలు కల్పించండి

- రేణిగుంట రైల్వే స్టేషన్ స్థాయి పెంచండి
- పార్లమెంటులో ఎంపీ గురుమూర్తి


పార్లమెంటులో మాట్లాడుతున్న తిరుపతి ఎంపీ గురుమూర్తి

తిరుపతి అర్బన్: రైల్వే జనరల్ బోగీల్లో సౌకర్యాలు మెరుగుపరచాలని ఎంపీ గురుమూర్తి కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ కోరారు. బుధవారం ఆయన పార్లమెంట్‌లో మాట్లాడుతూ.. రైల్వే జనరల్ కంపార్ట్‌మెంట్లలో వసతులు అధ్వానంగా ఉన్నాయని వాటిని పరిశీలించి, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలను అందించేలా తీర్చిదిద్దాలని డిమాండ్ చేశారు. రేణిగుంట రైల్వే స్టేషన్ స్థాయి పెంపునకు రూ.200 కోట్లతో ప్రాజెక్టు రిపోర్టు తయారుచేశారని, దాన్ని ఆమోదించి మంజూరు చేయాలన్నారు. స్టేషన్ అభివృద్ధిని శరవేగంగా చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే మంజూరైన కడప–బెంగళూరు లైన్ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలన్నారు. శ్రీకాళహస్తి–తిరుపతి రైల్వే లైన్ అభివృద్ధితోపాటు అమృత్ భారత్ పథకం ద్వారా కలికిరి రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేయాలన్నారు. రేణిగుంట–గూడూరు మార్గంలో 3వ లైన్‌ను మంజూరు చేయాలని కోరారు. తిరుపతి నుంచి మైసూర్ వరకు వందేభారత్ రైలు నడపాలని కోరారు. తిరుపతి నుంచి షిర్డీకి ప్రతిరోజు రైలు ఉండాలని తిరుపతివాసులు ఆకాంక్షిస్తున్నట్టు పేర్కొన్నారు. నాయుడుపేట స్టేషన్‌లో నవజీవన్ ఎక్స్‌ప్రెస్‌కు, వెందోడు రైల్వే స్టేషన్‌లో కృష్ణ, పూరీ ఎక్స్‌ప్రెస్‌లకు తప్పనిసరిగా స్టాపింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. రాజంపేట, కోడూరు, ఓబులవారిపల్లి, నందలూరు స్టేషన్‌లలో కోవిడ్‌కు ముందు ఉన్న అన్ని రైలు స్టాపింగ్‌లను పునరుద్ధరించాలని కోరారు. పండ్ల ఎగుమతులు, దిగుమతులకు సంబంధించి లోడింగ్, అన్‌లోడింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. చిత్తూరులో కోల్డ్ స్టోరేజీ సౌకర్యాల కల్పనకు మరిన్ని వనరులను కేటాయించాలని కోరారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటా


వృద్ధురాలితో మాట్లాడుతున్న నేదురుమల్లి

సైదాపురం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎళ్లవేళలా అండగా ఉంటానని ఆ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి భరోసా ఇచ్చారు. బుధవారం ఆయన సైదాపురం మండలంలోని గంగదేవిపల్లిలో పర్యటించగా నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు భారీ సంఖ్యలో విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ''మీకు ఏ కష్టమొచ్చినా అండగా ఉంటా.. మీరు అధైర్యపడొద్దు'' అని నాయకులు, కార్యకర్తలకు భరోసా ఇచ్చారు.

తిరిపిదాసుకు పరామర్శ..

వైఎస్సార్‌సీపీ పార్టీ తిరుపతి జిల్లా కార్యాలయంలో పని చేస్తున్న తిరిపిదాసు కుటుంబాన్ని నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పరామర్శించారు. ఇటీవల తిరిపిదాసు భార్య, ఇద్దరు పిల్లలు, అతని తమ్ముడి చేతిలో తిరుపతిలో హత్యకు గురవడంతో పాటు తమ్ముడు కూడా చనిపోయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నేదురుమల్లి మండలంలోని గంగదేవిపల్లికి విచ్చేసి తిరిపిదాసును ఓదార్చి, పార్టీ తరపున అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఆయన వెంట మండల కన్వీనర్ రవికుమార్ యాదవ్, కార్యవర్గ సభ్యులు వరదబండి ప్రభాకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ గుంటమడుగు శ్రీనివాసులురాజు, వైస్ ఎంపీపీ తిరకాల భాస్కర్, మాజీ సొసైటీ అధ్యక్షుడు మోహన్‌రావు, ఆదిశేషయ్యనాయుడు, శివకుమార్, నేతలు మాలకొండారెడ్డి, అబ్బిరాజు, కంభం విజయ భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీలు ఈశ్వరరాజు, వెంకటరమణయ్య, శ్రీనివాసులు, శివారెడ్డి, సుధాకర్‌యాదవ్, గంగాధర్‌రెడ్డి, ఓబుళనాయుడు, సాంబయ్య, శివ తదితరులు ఉన్నారు.

సహకార సంఘాలను బలోపేతం చేయండి

తిరుపతి అర్బన్: సహకార సంఘాలను బలోపేతం చేయాలని డీఆర్వో పెంచల కిషోర్ సూచించారు. కలెక్టరేట్‌లో ఆయన బుధవారం సహకార సంఘాల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఇవ్వాల్సిన ఎరువులను సక్రమంగా పంపిణీ చేయాలని ఆదేశించారు. నిర్మాణంలోని పలు గోదాములను వేగవంతంగా పూర్తి చేయించాలని సూచించారు. సంఘాల నేతృత్వంలో పెట్రోల్ బంకులు, జన ఔషధి కేంద్రాలు, కామన్ సర్వీస్ సెంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. వాటి నిర్వాహణపై సహకార సంఘాల జిల్లా అధికారి లక్ష్మితో చర్చించారు.

సీఏ ఫౌండేషన్ ఫలితాల్లో

ఎమరాల్డ్స్ విజయకేతనం


ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో ఎమరాల్డ్స్ డైరెక్టర్లు

తిరుపతి ఎడ్యుకేషన్ : సీఏ ఫౌండేషన్ పరీక్షా ఫలితాల్లో తిరుపతి ఎల్‌బీసీ రోడ్డులోని ఎమరాల్డ్స్ ప్రొఫెషనల్ అకాడమీ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి విజయకేతనం ఎగురవేశారు. ఆ మేరకు ఆ విద్యాసంస్థ డైరెక్టర్లు ఈ.గిరిధర్, కె.విశ్వనాథ్ తెలిపారు. ఈ ఫలితాల్లో తమ విద్యార్థులు రాధిక, ప్రణవ్, లిఖిత్, సుశీలేంద్రరావు, సరితలు అత్యధిక మార్కులు సాధించారని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులను అభినందించారు.

పలువురు డీఎస్పీల బదిలీ

– చిత్తూరు ఎస్పీ సతీమణికి తిరుపతిలో పోస్టింగ్


హర్షిత


పార్థసారథి

చిత్తూరు అర్బన్: చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పలువురు డీఎస్పీలను బదిలీ చేస్తూ డీజీపీ ద్వారకా తిరుమలరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. చిత్తూరు డీటీసీలో పనిచేస్తున్న డి.శ్రావణ్‌కుమార్ ఏలూరు టౌన్‌కు, తిరుపతి డీటీసీలో విధులు నిర్వర్తిస్తున్న బుక్కే మురళిని పులివెందులకు, తిరుమల నుంచి కె.శ్రీనివాసాచారిని కర్నూలు దిశ స్టేషన్‌కు, తిరుపతి రైల్వే డీఎస్పీ షానూ షేక్‌ను పోలీసు ప్రధాన కార్యాలయానికి బదిలీ చేశారు. అలాగే విజయవాడలో పనిచేస్తున్న బి.పార్థసారథిని కుప్పానికి, తిరుపతి పీటీసీ నుంచి ఘట్టమనేని శ్రీనివాసరావును నెల్లూరు రూరల్‌కు, తిరుపతి డీఎస్పీ కె.రవిమనోహరాచారిని సీఐడీకి, నెల్లూరు సీసీఎస్‌లో పనిచేస్తున్న పి.రామకృష్ణాచారిని తిరుపతి ట్రాఫిక్‌కు, తిరుపతి పీటీసీలో ఉన్న ఎం.రాజారావును విజయవాడ నార్త్‌కు, గూడూరులో పనిచేస్తున్న ఎం.సూర్యనారాయణరెడ్డి, నాయుడుపేటలో విధులు నిర్వర్తిస్తున్న వి.శ్రీనివాసరెడ్డి, శ్రీకాళహస్తి డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డిని పోలీసు ప్రధాన కార్యాలయానికి బదిలీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా, చిత్తూరు ఎస్పీ మణికంఠ సతీమణి ఎస్ఆర్ హర్షిత మణ్యం జిల్లా దిశ స్టేషన్‌లో డీఎస్పీగా పనిచేస్తుండగా ఆమెను తిరుపతి రైల్వేకు బదిలీ చేశారు.

పోగొట్టుకున్న నగలు, బంగారం అప్పగింత

తిరుపతి క్రైమ్: తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చి ఘాట్ రోడ్లో పోగొట్టుకున్న నగలు, బంగారు నగలు కలిగిన బ్యాగును గంటల వ్యవధిలోనే అప్పగించిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు బుధవారం రాత్రి అలిపిరి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. విశాఖపట్నం జిల్లా పార్వతీపురానికి చెందిన గోపాలకృష్ణ(52) తిరుమల శ్రీవారి దర్శనానికి కుటుంబ సభ్యులతో కలిసి వచ్చారు. వాహనంలో తిరుమల ఘాట్ రోడ్‌లో వెళ్తుండగా ఫొటోలు తీసుకునేందుకు వాహనం పక్కన ఆపి పిట్టగోడపై నగదు, బంగార నగలు కలిగిన బ్యాగును మరిచిపోయి వెళ్లిపోయారు. అనంతరం తిరుమలకు వచ్చి చూసుకోగా బ్యాగు మరచిపోయినట్లుగా గుర్తించారు. వెంటనే తిరుమల క్రైమ్ పోలీసులకు రూ.1,50,000 నగదు, రూ.8.40 లక్షలు విలువచేసే 140 గ్రాముల బంగార నగలు ఉన్న బ్యాగు మిస్ అయినట్లు బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు తక్షణమే ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా అన్ని పోలీస్ స్టేషన్లను అప్రమత్తం చేయాలని ఆదేశించామని ఎస్పీ తెలిపారు. తిరుపతి, తిరుమల క్రైమ్, అలిపిరి, తిరుమల పోలీసులు కంట్రోల్ రూమ్ ద్వారా పరిశీలించి సదరు బ్యాగును ఒక జీపు డ్రైవర్ తీసుకెళ్లినట్లుగా గుర్తించారు. సదర్ జీపు డ్రైవరు అప్పటికే పోలీసులకు సమాచారం అందించి నిజాయితీని చాటుకున్నారని తెలిపారు. అనంతరం ఆ బ్యాగును బాధితులకు అప్పగించామని ఎస్పీ తెలిపారు.


బాధితులకు బ్యాగు అప్పగిస్తున్న జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు

ఇద్దరు సీఐలకు స్థాన చలనం

చిత్తూరు అర్బన్: తిరుపతి జిల్లాల్లో పనిచేస్తున్న ఇద్దరు సీఐలను బదిలీచేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. తిరుపతి ఎర్రచందనం స్మగ్లింగ్ నిరోధక విభాగంలో పనిచేస్తున్న కె.శ్రీరామ్‌ను ఆదోని వన్‌టౌన్‌కు, భాకరాపేట సీఐ డి.మస్తాన్‌వలిని కర్నూలు జిల్లా ఆస్పరికి బదిలీ చేశారు. మరో రెండు రోజుల్లో భారీగా సీఐలు, డీఎస్పీలు బదిలీ కానున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

DIRECT FINAL YEAR
Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT, B.Tech, Diploma, MA, M.Com, M.Sc, MBA, MCA Regular/lateral entry 9381287529

Real Estate

PLOTS FOR SALE
భవిష్యత్తులో అత్యధిక ధరలు పెరిగే Plots 1) తిరుపతి అన్నమయ్య సర్కిల్ నుండి కేవలం 5 K.M లో CPR & విష్ణుప్రియ విల్లాలు, ఢిల్లీ పబ్లిక్ & అకార్డ్ కార్పొరేట్ స్కూల్స్, Medjee & శ్రీ చైతన్య కాలేజీలు దాటగానే C.రామాపురం వద్ద 100 Feets మెయిన్ రోడ్డుకు అనుకున్న జైన్ టెంపుల్ పక్కన & వెనుక Phase-2 & 2) తిరుపతి నుండి 3 K.M లో Taj 5 Star హోటల్ దాటగానే తనపల్లిలో 3)తిరుచానూరు 6 లైన్స్ హైవేకు అనుకున్న యోగానంద ఇంజనీరింగ్ కాలేజ్ ప్రక్కన Plotsఅమ్మబడును. 9010022254.

Services

వ్యవసాయ భూములకు, రైతులకు ఉద్యోగస్థులకు, పర్సనల్, వ్యాపారస్థులకు మొదలగు వారికి సలహాలు మరియు సహాయం చేయబడును. సం.ప్ర: 90632 90864.

GOLD FINANCE
బంగారం బ్యాంకులలో, ఇతర సంస్థలలో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. స్పాట్ క్యాష్. సంప్ర॥ 99516 88858

నాలుగులైన్ల ప్రకటనకు : రూ. 375/-
అదనపు లైనుకు : రూ. 90/-
ప్రతి ప్రకటనపై G.S.T 5% అదనం
Contact
9705444178
9951602970

TOURS & TRAVELS
రామేశ్వరం, అరుణాచల గిరిప్రదక్షిణ, ధనుష్కోటి, తిరునాళ్లారు, చిదంబరం 17.08.24 తేది 3రోజులు.టికెట్ 4999/-.(ACబస్సు, భోజనం, రూం) కె.వాసు, నెల్లూరు. 94913 40504.

Wanted

నగరి, పుత్తూరు, పాకాల, వేంపల్లిగుంట, రాజంపేట, సూళ్లూరుపేట పరిసర ప్రాంతాలలో రెసిడెన్షియల్ ప్లాట్స్‌ని మార్కెటింగ్‌కి ఏజెంట్లు కావలెను. పద్మ, 9177223100, 8328210044.

స్పాట్ జాయినింగ్, కార్పొరేట్ బ్యాంక్స్ నందు అసిస్టెంట్ మేనేజర్స్, ప్రాసెసింగ్ ఆఫీసర్స్, క్లర్క్స్ జాబ్స్ కలవు. Qual: Degree/PG జీ: 22000 to 28000, ఆ పైన Cont: 9885122226

తిరుపతి హోమ్ కేర్ సర్వీసెస్, శ్రీమంతుల ఇళ్లలో పనిచేయుటకు పెద్దవారిని, పేషంట్లను చూసుకోనుటకు వర్కర్స్ 24/7 కావలెను. రూం+భోజనం ఫ్రీ. జీ:15000–18000 ☏8121555034, 8121555040

కష్టపడేస్తే కాదు VIP ఇండ్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటచేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15000–40000 ఫ్రీ రూం+భోజనం.HYD.Ph: 6309020999

షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడి సూపర్ వైజర్స్, నర్సులు, కాంపౌండర్స్, ఆయాలు, హౌస్‌కీపింగ్ భార్యాభర్తలు కావలెను. 9391036931, 9246585901

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులకు కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

